31వ వసంతంలోకి

చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

గురువారం 9 ఏప్రిల్ 2026 పేజీలు : 8

# ప్రజల కోసమే పనిచేస్తా

## జన్మభూమికి దేవ్ జీ



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఏప్రిల్,08 :** ప్రజల కోసమే పనిచేస్తానని... తాను ఎక్కడున్నా ప్రజా సమస్యల పరిష్కారమే తన ఎజెండా అని స్పష్టం చేశారు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ. ఎక్కడ తన అవసరముంటే అక్కడకు వెళతానంటూ చెప్పుకొచ్చారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత సొంతూరు కోరుట్లకు వచ్చిన సందర్భంగా మీడియా ప్రతినిధులతో కాసేపు ముచ్చటించారు. 1983లో ఉద్యమ బాట పట్టిన దేవ్‌జీ మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారు. ఎన్ఐఏ మోస్ట్ వాంటెడ్ లిస్టులో ఉన్న దేవ్‌జీ ఇటీవలే సహచర నేతలతో కలిసి లొంగిపోయారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డితో కూడా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అయితే స్వగ్రామం కోరుట్లకు రావడానికి కొంత సమయం పట్టింది. 42 ఏళ్ల తర్వాత దేవ్‌జీ కోరుట్లకు రావడంతో -2లో

## గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే

# ప్రజాప్రభుత్వం సంకల్పం





**-రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి అధికారులకు దిశానిర్దేశం**

**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఎప్రిల్ 8:** గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే ప్రజాప్రభుత్వ ద్యేయమని, గిరిజన ప్రాంత సమస్యల పరిష్కారంలో అధికారులు మానవతా దృక్పథంతో పనిచేయాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో గిరిజన ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వారి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలని, ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. పేదగిరిజనులు నివసించే ప్రతి ప్రాంతానికి రహదారి,నివాస యోగ్యమైఇల్లు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి కోసం బోర్లు వంటి ప్రాథమిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రిఅడ్లూరిస్పష్టం చేశారు. ఈ మౌలిక సదుపాయాలే గిరిజనుల జీవన ప్రమాణాల పెరుగుదలకు పునాదని పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, వివిధ జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలు, అటవీ శాఖ అధికారులు, గిరిజన ప్రాంతాల ప్రజాప్రతినిధులతో గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై విస్తృతంగాచర్చించారు. గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల్లోప్రభుత్వం మౌలిక వసతుల కోసం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ అమలు దశలో ఎదురవుతున్న అడ్డంకులపై మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలంటే -2లో

## డంపింగ్ యార్డ్ పై పోరాటానికి

# అన్ని పార్టీలు కలిసి రావాలి

- చావడానికైనా సిద్ధం.. కానీ డంపింగ్ యార్డ్‌ను రానివ్వను
- సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్లు.. మెడికల్ కాలేజీ పెట్టండి..
- డంపింగ్ యార్డ్ వద్దు..
- డంపింగ్ యార్డ్ పై పోరాటాన్ని జేఏసీ ముందుకు తీసుకోవాలి
- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి
- ఒకరోజు దీక్ష విరమించిన కౌశిక్



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 8 :** డంపింగ్ యార్డ్ రద్దు కోసం ఎంతవరకైనా పోరాడతానని.. అవసరమైతే చావడానికైనా సిద్ధం కానీ డంపింగ్ యార్డ్ ను రానివ్వబోనని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. హుజురాబాద్ మండలం సిరిసపల్లిలో ప్రభుత్వం ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షలో భాగంగా మంగళవారం రోజు ఒకరోజు దీక్ష చేపట్టిన కౌశిక్ బుధవారం ఉదయం దీక్షను ముగించారు. ఈ -2లో

# నేడు జగిత్యాలకు కేటిఆర్ రాక

## జీవన్ రెడ్డికి బిఆర్ఎస్‌లోకి ఆహ్వానం..?



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 8:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటిఆర్ నేడు జగిత్యాల జిల్లా కేంద్రానికి రానున్నట్లు మాజీ జడ్పి చైర్ పర్సన్ దావ వసంత సురేష్ బుధవారం తెలిపారు. కేటిఆర్ జగిత్యాల పర్యటన సందర్భంగా జిల్లా కేంద్రంలోని ధరూర్ చౌరస్తా వద్ద కేటిఆర్ కు ఘనంగా స్వాగతం పలికేందుకు బిఆర్ఎస్ శ్రేణులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి, సీనియర్ నాయకులు టి.జీవన్ రెడ్డితో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ భేటి కానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన జీవన్ రెడ్డిని బిఆర్ఎస్ లోకి ఆహ్వానించనున్నట్లు సమాచారం. కేటిఆర్ జగిత్యాల పర్యటన సందర్భంగా రాష్ట్ర రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. కేటిఆర్ మాజీ మంత్రి జీవన్ రెడ్డిని బిఆర్ఎస్ ఆహ్వానిస్తే ఆయన ఎప్పుడు పార్టీలోకి చేరుతారో అనే విషయంపై స్పష్టత రానుంది. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన అనంతరం మాజీ మంత్రి జీవన్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, స్థానికంగా బిఆర్ఎస్ శ్రేణులతో కలసి పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతో ఆయన గూలాబీ తీర్థం పుచ్చుకుంటారని గత కొన్ని రోజులుగా ఊహాగానాలు విన్పించాయి. కేటిఆర్ జగిత్యాల పర్యటన ఖరారు కావడం, ఆయన మాజీ మంత్రి -2లో

## ఏసిటిఓలకు పచ్చ పెన్ బహుమతి

**- ముజాహిద్ హుస్సేన్**



**చురకలు విలేఖరి కరీంనగర్, ఏప్రిల్, 08:** కరీంనగర్ పట్టణంలో జాయింట్ కమిషనర్ వాణిజ్య పనుల శాఖ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన టి సి టి ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ కు భారీ ఎత్తున గజమాలతో శాలువలకు టి సి టి ఎన్జీవోస్ కరీంనగర్ డివిజన్ అధ్యక్షులు మొహమ్మద్ సలావుద్దీన్ జనరల్ సెక్రెటరీ విష్ణు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాల వాణిజ్య పనుల శాఖ జాయింట్ కమిషనర్ గోపాల్ సమక్షంలో తెలంగాణ రాష్ట్రంలో వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న 537 ఏ సి టి ఓ నాన్ గెజిటెడ్ నుండి గజిటెడ్ హోదా పొందిన ఏ సి టి ఓ లు అందరికీ గ్రీన్ పెన్నుతో పాటు జీవో ఎంఎస్ 79 ప్రొసిడింగ్ కాపీ అందించడం జరిగింది దాదాపు 10 సంవత్సరాల నుండి సుదీర్ఘముగా పోరాటం చేసి ఇప్పుడు రాష్ట్రంలో పనిచేస్తున్న ఏసీటీవో లకు అందరికీ గజిటెడ్ హోదా రావడానికి ఎంతో కృషి చేసిన తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ కు ఈ సందర్భంగా అందరూ కలిసి సన్మానం చేసినారు ఈ కార్యక్రమంలో డి సి నాయక్ అసిస్టెంట్ కమిషనర్ చరణ్ కవిత గౌతమ్ సిద్ధార్థ శ్రీనివాస్ రాజేందర్ తిరుపతిలో తో పాటు ఉద్యోగ సంఘ నాయకులు జి బిక్షపతి శంకర్ అనిల్ కుమార్ సలావుద్దీన్ విష్ణు మహమ్మద్ అబ్దుల్ భారీ మహమ్మద్ అఖిల్ శ్రీనివాస్ రజిని రజిత రెహానా శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు

## ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు

**చురకలు విలేఖరి కరీంనగర్, ఏప్రిల్, 08:** ఏ సి టి ఓ గజిటెడ్ హోదా కొరకు రికమండేషన్ చేసిన రాజకీయ పార్టీ కాంగ్రెస్ పార్టీ 36 మంది ఎమ్మెల్యేలు ఇద్దరు ఎమ్మెల్సీలు మంత్రులు పొన్నం ప్రభాకర్ సీతక్క కొండా సురేఖ ఎంఐఎం మజిలీస్ పార్టీ ఆరుగురు శాసనసభ్యులు ఇద్దరు ఎమ్మెల్సీలు ఒక పార్లమెంట్ సభ్యులు దు బిజెపి పార్టీ ఎమ్మెల్యేలు ఐదుగురు భారతీయ రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు ఏడుగురు సిపిఐ శాసన పక్ష నాయకుడు సాంబశివరావు ఇంతమంది లేఖలు ఇచ్చినారు. రెండు పీఆర్సీలు రికమండేషన్ లా సెక్రటరీ రికమండేషన్ వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ లేఖలు తెలంగాణ వాణిజ్య పనుల శాఖ ఎక్సైజ్ శాఖ రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎం రఘునందన్ రావు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తాన్ ఐఏఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంతమంది చొరవతో తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న 537 మంది ఏ సి టి ఓ లు ఈరోజు జీవో ఎంఎస్ 79 ఈ నెల 4 న ఏ సి టి ఓ లు గెజిటెడ్ హోదా పొందినారు.

## నేడు జగిత్యాలకు కేటీఆర్ రాక

**మొదటి పేజీ తరువాయి....** జీవన్ రెడ్డితో భేటి కానుండటంతో అటు కాంగ్రెస్కు రాజీనామా చేసిన జీవన్ రెడ్డి అనుచరులు, బిఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. మాజీ మంత్రి జీవన్రెడ్డికి జగిత్యాల జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణలోని పలు నియోజకవర్గాల్లో అభిమానులు, అనుచరులు ఉండడంతో బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ఈ విషయం కలిసి వస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## డంపింగ్ యార్డ్ పై పోరాటానికి...

**మొదటి పేజీ తరువాయి....** అవసరమైతే కెసిఆర్ కేటీఆర్ హరీష్ రావు లను కూడా ఇక్కడికి తీసుకు వస్తానని అన్నారు. డంపింగ్ యార్డ్ అంశంపై కాంగ్రెస్ పార్టీ నిద్రపోయినట్లు నటిస్తోందని ప్రజలు గమనిస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో హుజురాబాద్ కీలకపాత్ర పోషించిందని, ఇది నియోజకవర్గం లోని అన్ని గ్రామాలకు సంబంధించిన సమస్య అని అన్నారు. చెత్త వాహనాలు వందల సంఖ్యలో ప్రయాణిస్తుంటే చెత్తను తీసుకువస్తుంటే రోడ్లపై పడి కాలుష్యం ఎక్కువ అవుతుందని ఆయన అన్నారు. డంపింగ్ యార్డ్ విషయంలో మాజీ ఎమ్మెల్యేలు సతీష్ బాబు రసమయి బాలకిషన్తో కలిసి ఎలకతుర్తి భీమదేవరపల్లి మానకొండూరు శంకరపట్నం గ్రామాల్లోనూ సమావేశాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, జేఏసీ నాయకులు పలకల ఈశ్వర్ రెడ్డి, మల్లారెడ్డి, రత్నం, జయపాల్ రెడ్డి. రవీందర్ రావు రాజేశ్వరరావు, బి ఆర్ ఎస్ నాయకులు గందె శ్రీనివాస్ కొండల్ రెడ్డి ప్రతాపత్ తిరుమలరెడ్డి తాళ్లపల్లి శ్రీనివాస్ కొలిపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పం

**మొదటి పేజీ తరువాయి....** సంబంధిత శాఖల మధ్య సమన్వయం అవసరమన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిరిజనుల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ప్రభుత్వం కెటాయించిన నిధులు లక్ష్యానికి చేరేవిధంగా అధికారులు కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. నిధులు ఉన్నా పనులు జరగకపోవడాన్ని సహించ బోమని హెచ్చరించారు. అటవీ భూములు, పోడు సాగు, ఫారెస్ట్ రైట్స్ చట్టంకిందహక్కుల పత్రాల జారీ విషయంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి అత్యంతప్రాధాన్యంగాతీసుకున్నారు. అటవీ, రెవెన్యూ శాఖలు సమన్వ యంతో పని చేసి సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలని సూచించారు. అవసరమైతే ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి వేగంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అడవిని నమ్ముకొని జీవిస్తున్న గిరిజనలు వారికి వ్యవసాయం ఒక్కటే ఆధారమని,అటవీ చట్టం అనుసరించి వారికి ఎక్కడ వీలు అయితే అక్కడ వ్యవసాయం చేసుకునేలా సాగు భూమిని అందుబాటులో ఉండేలా చూడాలని మంత్రి అడ్లూరి అటవీశాఖ అధికారు లను ఆదేశించారు.గిరిజన యువత ను ప్రభావితం చేస్తున్న కుల ధ్రువీకర ణ సమస్యలపై మంత్రి ప్రత్యేక చొరవ చూపారు. హైకోర్టు అడ్వకేట్ జనరల్ తో సంప్రదించి ఎస్టీ సర్టిఫికెట్ వ్యవహారంలో శాశ్వత పరిష్కారం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇకపై కుల ధ్రువీకరణ లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా సరళమైన విధానాన్ని అమలు చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, ఐటీడీఏ అధికారులు,అటవీ,పంచాయతీ రాజ్ శాఖలుసమన్వయంతో పనిచేయాలని, ప్రతి జిల్లాలో ప్రత్యేక సమీక్షలు నిర్వహించి సమస్యలను స్థానికంగానే పరిష్కరించే విధానాన్ని అమలు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఇసుక రవాణా సమస్యలు గిరిజనులకు అడ్డంకి కాకూడదని, అవసరమైన చోట ప్రత్యేక అనుమతులిచ్చి నిర్మాణాన్ని వేగవంతంచేయాలన్నారు.తాగునీటి సమస్య నివారణకు కొత్త బోర్లు,పాత వనరులను పునరుద్ధరించడం చేపట్టాలని అధికారులకు సూచించారు.గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలని మంత్రి నిర్ణయించారు. గిరిజన గ్రామాలను స్వయంగా సందర్శించి వాస్తవ పరిస్థితులను తెలుసు కుంటానని తెలిపారు.ఈ నెల ఆఖరులో గిరిజన ప్రాంతాల్లో ముఖ్య సమస్యల పరిష్కారం దిశగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధంచేసి అమలు చేయాలని మంత్రి గడువు విధించారు. ఒక ప్రాంత సమస్యను రాష్ట్రవ్యాప్తంగా వర్తింపజేయకుండా, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణ యాలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుం టానని మంత్రి అడ్లూరి హామీఇచ్చారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ గిరిజన సమస్య లపై ప్రత్యేక సమావేశం నిర్వహించి నందుకు మంత్రిని ప్రత్యే కంగా అభినందించారు.ఈ సమావేశం లో సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్యసాచి ఘోష్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సువర్ణ, ఎమ్మెల్యే లు బాలు నాయక్, రామచంద్ర నాయక్, డా,చిక్కుడువంశీకృష్ణ, మురళి నాయక్, కోవ లక్ష్మి, అనిల్ కుమార్ యాదవ్ తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్నగర్, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏ అధికారులు, డిఎఫ్ఓలు ఇతర ఉన్నతఅధికారులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ పై పోరాటానికి...

**మొదటి పేజీ తరువాయి...**సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం డంపింగ్ యార్డ్ పేరిట పెద్ద కుట్ర చేస్తోందని.. ప్రస్తుతం సేకరించిన భూమికి తోడు మరో 125 ఎకరాలు కూడా సేకరించాలని నిర్ణయించిందని.. మరో 500 ఎకరాలు కూడా సేకరించేందుకు రంగం సిద్ధం చేస్తుందని ఆయన ఆరోపించారు. జేఏసీ పోరాటం, తన దీక్ష ఆరంభం మాత్రమే.. ఇంకా పోరాటం మొదలుపెట్టలేదు.. మొదలుపెడితే ఎవరిని తిరగనిచ్చేది లేదు అని ఆయన హెచ్చరించారు. కొంతమంది ఇది గత ప్రభుత్వం తీసుకు వచ్చిందని చెప్తున్నారు.. అందులో ఎలాంటి వాస్తవం లేదు.. అని ఆయన ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను, వరంగల్ సభలో సీఎం మాట్లాడిన మాటలను వినిపించారు. డంపింగ్ యార్డ్ తెచ్చింది ప్రభుత్వం.. రద్దు కూడా చేయాల్సింది కాంగ్రెస్ ప్రభుత్వమే.. మీరు రద్దు చేయండి మీకు పాలాభిషేకాలు చేస్తాం అని ఆయన అన్నారు. రాబోయే కాలంలో అన్ని గ్రామాల్లో సభలు నిర్వహిస్తామని ప్రజలను చైతన్యం చేస్తామని ఆయన వెల్లడించారు. కొంతమంది జేఏసీ.. బి ఆర్ ఎస్ పార్టీకి అనుకూలంగా ఉందని ప్రచారం చేస్తున్నారని, అలాంటివారికి దేహశుద్ధి తప్పదని ఆయన హెచ్చరించారు. ప్రజల కోసం జేఏసీ ఉద్యమిస్తోందని ఆయన ప్రశంసించారు. తన దీక్షకు హాజరైన ప్రజలకు ఆయా పార్టీల నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లేందుకే తన దీక్ష చేశానని, గతంలో బంద్ కూడా విజయవంతం అయిందని, అలాగే అసెంబ్లీలోను తాను డంపింగ్ యార్డ్ అంశాన్ని ప్రస్తావించారని వివరించారు. ఉమ్మడి వరంగల్ కరీంనగర్ జిల్లాల నుండి చెత్తను తెచ్చి ఇక్కడ వేస్తా అంటే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. తనతో కొంతమంది డంపింగ్ యార్డ్, వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ తో అభివృద్ధి జరుగుతుందని చెప్పారని.. అలాంటప్పుడు అది తీసుకువెళ్లి కొడంగల్ లో పెట్టాలని.. కొడంగల్ లోని పరిశ్రమలు హుజురాబాద్ కు తీసుకురావాలని ఆయన సవాల్ చేశారు. హుజురాబాద్ ప్రజల ఆశీర్వాదంతో తను గెలిచారని, మూడున్నర లక్షల మంది ప్రజలు ఇక్కడ ఉన్నారని, రెండున్నర లక్షల మందికి తాను ప్రతినిధిని అని, వారి హక్కులను జీవితాలను కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందని ఆయన ఉద్వేగంగా అన్నారు. రాజకీయాలు వద్దని ప్రజల ప్రాణాల ముఖ్యమని, డంపింగ్ యార్డ్ వంటి సున్నితమైన అంశంపై భిన్న అభిప్రాయాలు మాని అందరూ ఐక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అవసరమైతే కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ తో కూడా తాను కలిసి పోరాటం చేసేందుకు సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ వెంకట్ కూడా దీనికి సంఘీభావం తెలపాలని సూచించారు. తాను ఎప్పుడు హుజురాబాద్లో అందుబాటులో ఉంటానని ఎప్పుడు పిలిచిన జేఏసీ సమావేశానికి వస్తానని ఆయన అన్నారు.

# ప్రజల కోసమే పనిచేస్తా...

**మొదటి పేజీ తరువాయి....** కుటుంబసభ్యులు, బంధుమిత్రులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన కాసింత భావోద్వేగానికి లోనయ్యారు. ఉద్యమంలోకి వెళ్లేటప్పుడు తాను ఇక ఇంటికి తిరిగి రాలేనేమోనని అనుకున్నానే తప్ప... ఇలా మీ ముందుకు వస్తానని కలలో కూడా ఊహించలేదని అన్నారు. పరిస్థితుల ప్రభావం వల్ల జనజీవన స్రవంతిలోకి రావాల్సి వచ్చిందని.. ఇకపై కూడా ప్రజల పక్షాన నిలబడేందుకు ప్రజాక్షేత్రంలో ఉంటానని తెలిపారు. ఆపరేషన్ కగార్ తదితర పరిణామాల నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీన దేవ్జీ అడవిబాట వీడి పోలీసుల ఎదుట లొంగిపోయారు. వివిధ కారణాల రీత్యా ఇప్పటివరకు హైదరాబాద్లోనే ఉన్న దేవ్జీ తొలిసారిగా స్వగ్రామం కోరుట్లకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే లొంగిపోయిన తర్వాత చాలా సందర్భాల్లో మీడియాతో మాట్లాడిన దేవ్జీ ఇక క్రియాశీల రాజకీయాల్లోకి రానున్నట్లు ప్రకటించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఆ విషయం కాస్తా చర్చనీయాంశమైంది. అదే క్రమంలో కోరుట్లలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... ప్రజల కోసం తన అవసరం ఎక్కడుంటే అక్కడకు వెళతానని చెప్పారు. ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల తరపున నిలబడతానని స్పష్టం చేశారు. కోరుట్లలోని అంబేద్కర్ నగర్ ప్రాంతానికి చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్జీ విప్లవ భావజాలానికి ఆకర్షితులయి... 1983లో మావోయిస్టు ఉద్యమంలో చేరారు. అనతికాలంలోనే పార్టీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ మావోయిస్టు పార్టీలో ఉన్నతస్థానమైన దక్షిణ భారత జోన్ ఆపరేటర్గా కొనసాగారు. మావోయిస్టు సెంట్రల్ మిలిటరీ కమిషన్లో సీనియర్ సభ్యుడిగా పనిచేసిన దేవ్జీ... సెంట్రల్ రీజనల్ బ్యూరోకి మార్గనిర్దేశనం చేసేవారు. 2010 ఏప్రిల్ లో దంతెవాడలో జరిగిన మావోయిస్టు దాడిలో 74 మంది సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సిబ్బంది మృత్యువాత పడ్డారు. అయితే ఆ ఘటనకు దేవ్జీ ప్రధాన సూత్రధారి అనేది పోలీస్ వర్గాలు చెప్పే మాట. మావోయిస్టు పార్టీలో చేరిన తర్వాత తిప్పిరి తిరుపతి కాస్తా దేవ్జీ అయ్యారు. సంజీవ్, చేతన్, రమేశ్, సుదర్శన్, దేవన్న తదితర పేర్లతో పిలిచేవారు సహచరులు. నంబాల కేశవరావు మరణం తర్వాత 2025 సెప్టెంబర్లో మావోయిస్టు ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు దేవ్జీ. అయితే ఆపరేషన్ కగార్ తదితర పరిణామాల నేపథ్యంలో... తన సహచరులు మల్లా రాజిరెడ్డి, బడే చొక్కారావు, నూనె నర్సింహారెడ్డితో కలిసి ఫిబ్రవరి 22వ తేదీన తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయారు. 42 సంవత్సరాల తర్వాత దేవ్జీ స్వస్థలానికి వస్తున్నారనే సమాచారంతో ఆయన్ని చూడటానికి జనాలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

# ఉర్దూ మీడియంలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఏప్రిల్ 08 :** కోరుట్ల పట్టణంలోని 23వ వార్డులోని ఎస్కునిగుట్ట (నయీమ్ నగర్) మండల పరిషత్ ప్రాథమిక ఉర్దూ మీడియం పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. 2011లో స్థాపించ బడిన ఈ పాఠశాల 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ మంచి గుర్తింపు సంపాదించింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్మన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ షాహిద్, మండల విద్యాశాఖ అధికారి గంగుల నరేశం, 23వ వార్డు కౌన్సిలర్ పుప్పాల ఉమాదేవి ప్రభాకర్ హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు స్వాగత



నృత్యాలు, నాటికలు ప్రేక్షకులను అలరించాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ వాజిద్ ప్రగతి నివేదికను వివరించగా ముఖ్య అతిథులు విద్యార్థుల ప్రతిభను కొనియాడుతూ అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలని, ఉర్దూ మీడియం విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు మున్సిపాలిటీ మరింత చర్యలు తీసుకుంటుందని ఛైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భూమయ్య,సిఆర్పి మాన్విత,భాగ్య, డాక్టర్ రమ్య,అలీ,వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజమ్,యూసఫ్ అలీ,అజయ్, షేక్ ఫరూఖ్, నజముద్దీన్ జాహిద్,అబిద్,సైఫుల్ అబిద్దిన్, సాదిక్ భాషా, షకీల్, ఇలియాస్, అశోక్, రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# సూర్య గ్లోబల్ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**చురకలు విలేకరి, జగిత్యాల, ఏప్రిల్ 8 :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని సూర్య గ్లోబల్ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని తమ విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన దశను ఆనందంగా జరుపుకున్నారు. పాఠశాల ఆవరణ ఆనందోత్సాహాలతో కళకళలాడింది. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకుని వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ల ప్రదానోత్సవం ప్రత్యేకంగా నిలిచింది. విద్యార్థులను ఒక్కొక్కరిని వేదికపైకి ఆహ్వానించి,




ప్రిన్సిపల్ మరియు డైరెక్టర్లు వారి చేతుల మీదుగా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలకు అభినందనలు తెలుపుతూ వారి భవిష్యత్తు విజయాల కోసం శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు గౌన్లు, టోపీలు ధరించి సర్టిఫికెట్లు స్వీకరించడం కార్యక్రమానికి మరింత ఆకర్షణను తెచ్చింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శ్రీధర్ రావు మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు మంచి విలువలు, నైతికతలను అలవర్చుకోవడం ఎంతో ముఖ్యమని సూచించారు. పిల్లల అభివృద్ధికి తోడ్పడిన తల్లిదండ్రులకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్ రావు, హరిచరణ్ రావు, ప్రశాంత్ రావు, మౌనిక రావు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు తమ అంకితభావంతో విద్యార్థులను ఈ స్థాయికి తీసుకువచ్చారని కొనియాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నేడు మొక్కజొన్న కొనుగోలు

# కేంద్రాల ప్రారంభం

### -విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపిన జువ్వాడి

**చురకలు విలేకరి,కోరుట్ల,ఏప్రిల్ 8 :** కోరుట్ల నియోజకవర్గంలో నేటి నుండి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకానున్నట్లు టిపిసిసి నాయకులు జువ్వాడి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో కలిసి మార్క్ ఫెడ్ ఎండీని సంప్రదించి నియోజక వర్గంలోని మూడు మండలాల్లో అత్యవసరంగా మక్కల కొనుగోలు కేంద్రాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. దీనికి స్పందించిన మార్క్ ఫెడ్ ఎండీ వెంటనే మంజూరు ఇచ్చారని తెలిపారు. నేడు ఉదయం మల్లాపూర్, కోరుట్ల, మెట్పల్లి మండలాల్లో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో



కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయని వివరించారు. ఈ మంజూరుకు సహకరించిన వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్కు కోరుట్ల నియోజకవర్గ రైతుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కన్నతల్లిని ఇంట్లోంచి గెంటేసిన కొడుకులు



**చురకలు విలేకరి, జగిత్యాల, ఏప్రిల్ 8 :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండల కేంద్రానికి చెందిన అఫ్సరీ బేగం(72) అనే వృద్ధురాలిని కొడుకులు అబ్దుల్ ఫహీం,అబ్దుల్ ఖయ్యూమ్, అబ్దుల్ నయీమ్‌లు పోషించక ఇంట్లోంచి గెంటి వేయగా జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్‌ను ఆశ్రయించారు. కాగా బుధవారం ఆ వృద్ధురాలు ఆర్డీవో కార్యాలయ ఆవరణలో తన గోడువిలేకరులకు వినిపించారు. తనకు సంబందించిన భూములు తీసుకున్న కొడుకులు,తన ఆరుగురు కూతుర్లకి సైతం ఎలాంటి ఆస్తులు ఇవ్వకుండా,తనను పోషించక ఇంట్లోంచి గెంటివేశారని ఆ తల్లి రోధించింది. ప్రభుత్వ ఉద్యోగి అయిన మూడో కొడుకు నుంచి చట్ట ప్రకారం నెలకు రూ.10వేలు ఇప్పించాలిని, మిగితా ఇద్దరు కొడుకుల నుంచి సైతం చెరి రూ.10వేలు ఇప్పిస్తూ తన ఇంటిని తనకు స్వాదీనం చేయించాలని ఆర్డీవో కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ అధికారి డి. రమేష్ కు ఫిర్యాదు చేయగా వయో వృద్ధుల సంరక్షణ చట్టం సెక్షన్ 2(బి ), సెక్షన్ 23 ల కింద కేసులు నమోదు చేశారు. వృద్ధురాలి వెంట సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, వృద్ధుల చట్టం కాన్సిలియేషన్ అధికారి పి. సి. హన్మంత్ రెడ్డి, వృద్ధురాలి కూతుర్లు పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయానికి సహకరించాలి

### -ఇబ్రహీంపట్నం ఏ ఈ సతీష్



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఏప్రిల్ (08) :** విద్యుత్ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఇబ్రహీంపట్నంలోని సతీష్ బుధవారం అన్నారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఇబ్రహింపట్నం మండలంలోని గోదుర్ 132/33 కెవి పెద్ద సబ్ స్టేషన్ నుండి యామపూర్, వేములకుర్తి సబ్ స్టేషన్లకు వచ్చే 33కెవి గోదుర్ ఫీడర్‌లో చెట్ల కొమ్మలు కొట్టడం కొరకు, ఉదయం 08:00 గంటల నుండి మధ్యహ్నం 12:00 గంటల వరకు తిమ్మాపూర్,తిమ్మాపూర్ తండా,యామాపూర్,ఫకీర్ కొండాపూర్, వేములకుర్తి, బర్దిపూర్, మూలరాంపూర్ గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, గ్రామాల పరిధిలో గల విద్యుత్ వినియోగదారులు,రైతులు సహకరించలని ఎఇ సుచించారు.

## వేములకుర్తిలో వారసంత ప్రారంభం






**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఏప్రిల్ (08) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో బుధవారం గ్రామ పంచాయతీ అధ్వర్యంలో వారసంత ఎర్పాటు చేయగా గ్రామసర్పంచ్ తరి రామానుజం వారసంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి బుధవారం బస్టాండ్ ప్రాంగణంలో ప్రజలకు కావలసిన నిత్యవసర సరుకులు కూరగాయలు తదితర సామాగ్రిని ఈ వారసంతలో విక్రయించుకునేందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బర్మ మల్లయ్య, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుమ్మల గంగన్న పంచాయతీ కార్యదర్శి గూడూరు శ్రీకాంత్ , మాజి సర్పంచ్ బుడుత సుదర్శన్,వార్డు సభ్యులు సిలివేరి మహేష్,రాధరపు దేవదాస్,రైతులు ఎడిపెల్లి భుమన్న,రాదరపు ప్రవిణ్,దుంపెట మహేష్,బోనగిరి రాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు పంపిణీలో అనధికారిక కార్యకలాపాలు

### -ఎంపిడిఓకు మద్దునూర్ సర్పంచ్ ఫిర్యాదు



**చురకలు విలేకరి,జగిత్యాల,ఏప్రిల్ 8 :** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం మద్దునూర్ గ్రామశీలో ప్రభుత్వ పథకాల పంపిణి గ్రామ పంచాయతీ పాలక వర్గం ప్రమేయం లేకుండా, రాజ్యాంగ విరుద్ధంగా, ప్రోటోకాల్ పాటించకుండా కొందరు వ్యక్తులు లబ్దిదారులకు పంపిణి చేస్తున్నారని మద్దునూర్ సర్పంచ్ గాలిపెల్లి భారతి మహేష్ ఆధ్వర్యంలో వార్డ్ సభ్యులు ఎంపిడిఓ, తహసీల్దార్ లకు బుధవారం పిర్యాదు చేశారు. గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అనదికారికంగా సదరు వ్యక్తులు నేరుగా లబ్ధిదారులకు పంపిణి చేయడం రాజ్యాంగ విరుద్దమని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో ప్రభుత్వ పథకాల పంపిణీలో జరుగుతున్న అనధికారిక కార్యకలాపాలపై విచారణ జరిపి,తగు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ, తహసీల్దార్ లను సర్పంచ్ భారతి మహేష్ , ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులు కోరారు.

# బర్దిపూర్ బురిడీ బాబా మాయాజాలం

**-సంతానం పేరుతో దంపతుల వద్ద రూ.80 వేల నిలువు దోపిడీ**
**-ఎలాంటి ఫలితం లేకపోవడంతో నిరాశకు గురైన బాధితుడు**
**-ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం**
**నమ్మించి మోసం చేసిన సదరు బాబా పై కఠిన చర్యలు తీసుకుంటారా..?**
**-లోపాయికారీ ఒప్పందాలతో పక్కదారి పట్టిస్తారా..?**



**చురకలు విలేకరి,మెట్‌పల్లి, ఏప్రిల్ 8 :** సంతానం కలగలేదనే ఆవేదన ఆ దంపతులను మోసగాడి చెంతకు చేర్చింది. ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన దంపతులు ఎవరో చెప్పిన మాటలు నమ్మి ఇబ్రహీంపట్నం మండలంలోని బర్దిపూర్ గ్రామానికి చెందిన ఓ దొంగ బాబా వలలో చిక్కి అప్పులపాలయ్యారు. ఆంధ్రప్రభ ముందే హెచ్చరించినట్లుగానే, జగిత్యాల జిల్లాకు చెందిన ఓ బురిడీ బాబా చేతిలో నిజామాబాద్ జిల్లాకు చెందిన పేద దంపతులు రూ.80 వేలు పోగొట్టుకుని లబోదిబోమంటున్నారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్పల్లి మండలం కోనసముందర్ గ్రామానికి చెందిన జంగిటి రాజేశ్వర్ దంపతులకు వివాహమై ఏళ్ళు గడుస్తున్నా సంతానం కలగలేదు. మానసిక వేదనతో ఉన్న వీరు ఆసుపత్రికి వెళ్తున్న క్రమంలో, తెలిసిన వారు చెప్పిన మాటలు నమ్మి జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం బర్దిపూర్ గ్రామానికి చెందిన సొంతి మోహన్ యోగి అనే వ్యక్తిని ఆశ్రయించారు.బాధితుల అమాయ కత్వాన్ని గమనించిన ఆ బురిడీ బాబా, ఏడాది తిరగకముందే మీకు సంతానం కలుగుతుందని నమ్మబలికాడు. పూజల పేరుతో ఆ నిరుపేద దంపతుల వద్ద నుండి రెండు విడతలుగా ఏకంగా 80 వేల రూపాయలు వసూలు చేశాడు. ఎంతకాలం గడిచినా ఫలితం లేకపోవడంతో తాము మోసపోయామని గ్రహించిన రాజేశ్వర్, చివరకు పోలీసులను ఆశ్రయించాడని సమాచారం. ప్రస్తుతం బాధితుడు రాజేశ్వర్ ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు, దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామన్నట్లు సమాచారం.



# పెన్షన్ ప్రధాత నకారా

**-టీ పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్**



**చురకలు విలేకరి, జగిత్యాల,ఏప్రిల్ 8 :** సుప్రీం కోర్టు ద్వారా పింఛను పొందడం ఉద్యోగి ప్రాథమిక హక్కుగా పెన్షనర్ల తరపున తీర్పు పొందడానికి కారకుడై న ధర్మ స్వరూప్ నకారా జయంతి వేడుకలు తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అసోసి యేషన్ కార్యాలయంలో జరిగిన నకారా జన్మదిన వేడుకల సందర్భంగా మార్చి మాసంలో రిటైర్ అయిన ఉద్యోగులను కొమురయ్య,ఆంజనేయులు, గంగాదర్ తదితరులను సన్మానించారు.ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ పాల్గొన్నారు.అయన మాట్లాడుతూ పెన్షనర్ల హక్కుల కోసం తమ రాష్ట్ర అధ్యక్షులు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో రాజీ లేని పోరాటం చేస్తామన్నారు.టీ జీ ఎంప్లాయిస్ జేఏసీ పిలుపు మేరకు రిటైరయిన వారి బెనిఫిట్స్ చెలింపునకు, పీ అర్సీ, ఆరోగ్య కార్డులు తది తర డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 17 నుంచి దశల వారీగా ఉద్యమిస్తామని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి పి.సి.హన్మంత్ రెడ్డి,కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథ్, ఉపాధ్యక్షులు ఎం.డి.యా కూబ్, ప్రకాష్ రావు, కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం, సత్యనారాయణ మెట్ పల్లి అధ్యక్షులు కుందేళ్ల మురళి, ధర్మపురి అధ్యక్షులు కండ్లె గంగాదర్, జగిత్యాల యూనిట్ అధ్యక్షులు బి. రాజేశ్వర్,మల్యాల అధ్యక్షులు ఎం.డి యాకూబ్ రెవిన్యూ పాల్గొన్నారు.

# సేఫ్ మదర్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహణ




**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 8 :** ప్రజాపాలన ప్రగతి పథకాలలో భాగంగా సేఫ్ మదర్ డే కార్యక్రమం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జీజీహెచ్)లో ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ గారు పాల్గొని అడిషనల్ కలెక్టర్ ప్రసంగిస్తూ, గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణ ప్రతి కుటుంబం మరియు సమాజం యొక్క బాధ్యత అని పేర్కొన్నారు. తల్లి ఆరోగ్యం బాగుంటేనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు.జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి ప్రసంగిస్తూ గర్భిణీలు గర్భధారణ సమయంలో నిర్దిష్టంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, సమతుల్య పోషకాహారం తీసుకోవాలని, వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. ప్రభుత్వము గర్భిణీ స్త్రీల మరియు శిశు వుల ఆరోగ్య రక్షణ కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పద్మజ మాట్లాడుతూ గర్భిణీలకు సురక్షిత మాతృత్వం, ప్రసూతి ముందు మరియు తరువాత తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ వీరారెడ్డి, ఐఔ సరస్వతి,పి ఓ ఎం హెచ్ న్ డాక్టర్ సన, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, గర్భిణీ స్త్రీలు, తల్లులు మరియు ఇతర ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక




**చురకలు విలేకరి,ధర్మపురి, ఏప్రిల్ 8 :** రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల కోసం నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడాపోటిల్లో ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన గండికోట సహన్య, మలవత్ సాయిపల్లవి అద్భుత ప్రతిభ కనబరిచారు. తమ క్రీడా నైపుణ్యంతో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అరబిందో పాఠశాల కరస్పాండంట్ జాజాల రవీందర్, పాఠశాల ఇంచార్జి పురంశెట్టి హరీష్,వ్యాయమ ఉపాధ్యాయుడు హరీష్, ఉపాధ్యాయులు సహన్య, సాయిపల్లవిలను అభినందించారు.

## హిందూ సమ్మేళనం కరపత్రం ఆవిష్కరణ



**చురకలు విలేకరి,ధర్మపురి,ఏప్రిల్ 8 :** ధర్మపురి పట్టణంలో ఈ నెల 12 తేదీన జరుగబోయే హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని, విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. బుధవారం పట్టణంలో ని నంది చౌక్ వద్ద హిందూ సమ్మేళన ఆహ్వాన కరపత్రం ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి, హిందు సమ్మేళన సమితి అధ్యక్షులు ఇమ్మడి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కొంక సుధీర్, జనరల్ సెక్రటరీ ఉప్పుల రాకేష్, కోశాధికారి పిన్న శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులు పూదరి పవన్, సోమిశెట్టి శివసాయి, మరియు హిందూ సమ్మేళన సమితి కార్యవర్గ సభ్యులతో ఆవిష్కరించారు.ధర్మపురి ప్రజాప్రతినిధులు, మున్సి పల్ కౌన్సిలర్లు చిపిరిశెట్టి రాజేష్,నాయకులు వేముల రాజేష్,సంగి నర్సయ్య,పిల్లి శ్రీనివాస్,జక్కు రవీందర్,రంగు లక్ష్మి నరహరి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి పిల్లల హాజరు శాతం పెంచాలి



**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్,ఏప్రిల్ 8 :** అంగన్వాడికి వచ్చే పిల్లల హాజరు శాతాన్ని పెంచాలని సెక్టార్ సూపర్వైజర్లు షమీంసుల్తానా,హేమలత అన్నారు. బుధవారం మండలంలోని వెల్లుల మరియు జగ్గసాగర్ సెక్టార్ లకు సంబంధించిన అంగన్వాడీ టీచర్లకు మినీ రివ్యూ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పోషణ ట్రాకర్ మరియు ఎన్హెచ్టిఎస్ రెండు ఆప్ లలో రోజువారి కార్యక్రమాలను మరియు నెలలో చేయవలసినటువంటి కార్యక్రమాలను పొందుపరచడంపై టీచర్లకు అవగాహన కల్పించారు.ఈ మేరకు సూపర్వైజర్లు మాట్లాడుతూ అంగన్వాడికి వచ్చే పిల్లల హాజరు శాతాన్ని పెంచాలని అదేవిధంగా రెండు ఆప్ లలో టేక్ హోమ్ రేషన్ డిస్ట్రిబ్యూషన్,ఫేస్ క్యాప్చర్లు, మెడికల్ అసెస్మెంట్లు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని టీచర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై కరీంనగర్ పోలీసుల ఉక్కుపాదం

**-మార్చి నెలలో విస్తృత తనిఖీలు**
**-120 ఎఫ్ఐఆర్‌లు, 139 వాహనాల స్వాధీనం, 161 మంది నిందితులపై కేసులు**
**- కరీంనగర్ సీపీ గౌష్ ఆలం**





**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 8 :** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా,నిల్వ మరియు విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని పోలీస్ అధికారులు తెలిపారు. మార్చి నెలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 120 కేసులు నమోదు చేసి,139 వాహనాలను స్వాధీనం చేసుకుని, 161 మంది నిందితులపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.అక్రమ ఇసుక రవాణా కారణంగా ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా,రోడ్డు భద్రత, పర్యావరణ సమతుల్యత,ప్రజా శాంతి భద్రతలపై ప్రతికూల ప్రభావం పడుతున్న నేపథ్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కఠినంగా వ్యవహరిస్తోందన్నారు.

**డివిజన్ వారీగా చర్యలు**

టౌన్ డివిజన్ పరిధిలో 15 కేసులు,12 వాహనాల స్వాధీనం,15 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు.రూరల్ డివిజన్ పరిధిలో అత్యధికంగా 73 కేసులు,79 వాహనాల స్వాధీనం, 98 మంది నిందితులపై కేసులు నమోదయ్యాయి.హుజురాబాద్ డివిజన్ పరిధిలో 32 కేసులు, 48 వాహనాల స్వాధీనం, 48 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు.

**పోలీస్ స్టేషన్‌ల వారీగా ముఖ్య గణాంకాలు**

మార్చి నెలలో కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా 28 ఎఫ్ఐఆర్‌లు,36 వాహనాల స్వాధీనం,40 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు.జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో 15 కేసులు, 24 వాహనాల స్వాధీనం,24 మంది నిందితులు నమోదు అయ్యారు. ఎల్ఎండీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 కేసులు నమోదయ్యాయి. మానకొండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 10 కేసులు,10 వాహనాలు, 15 మంది నిందితులు గుర్తించబడ్డారు.కరీంనగర్-2టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 9 కేసులు,6 వాహనాలు,9మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు.

**ఈ ఏడాది (మార్చి వరకు) సమగ్ర గణాంకాలు**

2026 సంవత్సరంలో మార్చి నెల వరకు కమిషనరేట్ పరిధిలో మొత్తం 245 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, 357 వాహనాలను స్వాధీనం చేసుకుని, 422 మంది నిందితులపై కేసులు నమోదు చేసినట్లు సీపీ తెలిపారు.

**డివిజన్ వారీగా:**

**టౌన్ డివిజన్:** 24 కేసులు, 27 వాహనాలు, 32 నిందితులు

**రూరల్ డివిజన్:** 139 కేసులు, 203 వాహనాలు, 241 నిందితులు

**హుజురాబాద్ డివిజన్:** 82 కేసులు, 127 వాహనాలు, 149 నిందితులు

**పోలీసుల హెచ్చరిక**

అక్రమంగా ఇసుక తవ్వకం, రవాణా, నిల్వ, విక్రయాల్లో పాల్గొనే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించాలని, సమాచారదాతల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

**సీపీ సందేశం**

“అక్రమ ఇసుక రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం జరుగుతుంది.ఇలాంటి కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించము. సంబంధిత పోలీస్ స్టేషన్‌ల పరిధిలో తనిఖీలు, నిఘా మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం” అని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# ఘనంగా బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఏప్రిల్ 8 :** కమాన్ పూర్ మండలం నాగారం ,రేపల్లెవాడ గ్రామాల్లో బుధవారం రోజున శ్రీదేవి భూదేవి సహిత బొడ్రాయి మరియు గ్రామ దేవతల ప్రతిష్టాపన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోత్సవాల మధ్య మిథున లగ్న శుభముహూర్తాన విగ్రహ ప్రతిష్టాపన భవనములు పూర్ణాహుతి నిర్వహించారు. మహిళలు భారీ ఎత్తున హాజరై పూజలు నిర్వహించారు. గత మూడు రోజులుగా కొనసాగుతున్న బొడ్రాయి ఉత్సవాలు అమ్మవార్ల ప్రతిష్టాపదలతో ముగిశాయి. అనంతరం అమ్మవార్లను పొలిమేర దాటించారు. అలాగే వేద పండితుల ఆధ్వర్యంలో హోమగుండం ఏర్పాటు చేసి దాన్ని కాల్చారు. దూర ప్రాంతాల నుండి తమ గ్రామమైన నాగారం గ్రామానికి వివిధ గ్రామాల్లో జీవిస్తున్న వారు వచ్చి బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో సర్పంచ్ పోనగంటి కుమార్, ఉప సర్పంచ్ వడ్నాల శ్రీనివాస్ తో పాటు భారీ ఎత్తున భక్తులు పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం నుండి మళ్లీ పోచమ్మ కలుపు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. గురువారం రోజున బలి కార్యక్రమంతో పోచమ్మ కలుపు ఉత్సవాలు ముగియనున్నాయి.

# ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలి

**-సర్పంచ్ల పోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 08 :** ఎల్లారెడ్డిపేట మండలంలో ఇందిరమ్మ ఇండ్లను త్వరిత గతిన పూర్తి చేయాలని ఎల్లారెడ్డిపేట మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య కోరారు.ఎల్లారెడ్డిపేట మండలానికి కొత్తగా-151 ఇండ్లు సాంక్షన్ అయ్యాయి . రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతుందని ఎల్లారెడ్డిపేట మండలంలోని ప్రజలు చాలామంది ఇందిరమ్మ ఇండ్ల వైపు చూస్తున్న తరుణంలో వచ్చే మే నెలలో రెండో విడత ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యాయన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాడి రామిరెడ్డి డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్ బీసీ సెల్ మండల అధ్యక్షులు అనవేనీ రవి యాదవ్ పుల్లయ్య గారి తిరుపతి గౌడ్ పందిళ్ళ శ్రీనివాస్ గౌడ్తదితరులు పాల్గొన్నారు.



# రేషన్ బియ్యం తూకాల్లో మోసం




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (గోదావరిఖని) ఏప్రిల్ 8 :** రామగుండం నియోజకవర్గం లోని పలు రేషన్ షాపుల్లో తూకాల్లో మోసం చేస్తున్నారని బి ఆర్ ఎస్ విద్యార్థి వింగ్ నాయకుడు గూడెపు రణధీర్ ఆరోపించారు.రామగుండం నియోజకవర్గంలో కొన్ని డివిజన్ రేషన్ షాప్‌లో భారీ కుంభకోణంరేషన్ షాప్ కాంటాలో 72 కిలోలు రావడం జరిగింది మరి అదే పక్కా షాప్ కి వెళ్లి మరి జోకుతే68 కిలోలు రావడం జరిగింది దీని పైన మరి అక్కడికి వెళ్లి వారిని అడిగితే అది కంప్యూటర్ కాంట అలాగే వస్తాయని వారు నిర్లక్ష్యపు సమాధానాలు రేషన్ డీలర్లు చెబుతున్నారని ఆరోపించారు. మరి ఒక్క ఇంటికే నాలుగు కిలోలు తక్కువ రావడం జరుగుతుంది మరి 3000మంది వరకు మరొక రేషన్ బియ్యం తీసుకోవడం జరుగుతుంది మరి ఎన్ని కింటాలు వారికి మిగులుతున్నాయి మరి కింటల్లో బియ్యం అన్ని కూడా మరి ఏమైపోతున్నాయి అని చెప్పి నేను ప్రశ్నిస్తున్న గూడపు రణధీర్ మరియు తగిన చర్యలు తీసుకోవాలని మరి దీనిపైన దీనికి సంబంధించిన అధికారులు తప్పకుండా స్పందించాలి మరి ఇలానే మరి ఎక్కడెక్కడనో వేలకొద్దీ స్కాములు జరుగుతున్నాయి అని పేర్కొన్నారు. వెంటనే అవినీతికి పాల్పడుతున్న రేషన్ డీలర్లను లైసెన్సు రద్దుచేసి నూతన డీలర్లకు అవకాశం ఇవ్వాలని రణధీర్ కోరారు.

# శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవ ఆహ్వానం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఏప్రిల్ 08 :** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలను రాచర్ల బొప్పాపూర్ ఉపసర్పంచ్ కొండాపూర్ వెంకట్ రెడ్డి కాంగ్రెస్‌పార్టీ నాయకులకు బుధవారం అందజేశారు.జిల్లా డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్‌కు గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్‌కు నారాయణపురం సర్పంచ్ దోమ్మడి నరసయ్యకు మార్కెట్ కమీటీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డికి డైరెక్టర్ మెండే శ్రీనివాస్ యాదవ్‌కు బండారి బాల్ రెడ్డికి రవీందర్ రెడ్డికి కాంగ్రెస్‌పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు రెండవ వార్డ్ నెంబర్ చల్ల పద్మా రెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపురం శ్రీనివాస్ రెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొంగరి కిష్టారెడ్డి శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవ పత్రికను అందజేశారు.

# చలివేంద్రాన్ని ప్రారంభించిన డిఎస్పీ



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 08 :** సిరిసిల్ల పట్టణ పరిధిలోని పాతబస్టాండ్ వద్ద మార్కండేయ ఫార్మసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినచలివేంద్రాన్ని డిఎస్పీ నాగేంద్రచారి ప్రారంభించారు.వేసవి కాలంలో ప్రయాణికులు, స్థానిక ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అని డిఎస్పీ నాగేంద్ర చారి పేర్కొన్నారు.ఈ సందర్భంగా డిఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ,ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని, మరిన్ని సంస్థలు ముందుకు వచ్చి ప్రజలకు సహాయం చేయాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఫార్మసీ సభ్యులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా జాగృతిలోకి కొనసాగుతున్న చేరికలు

**-కవితక్క నాయకత్వంపై విశ్వాసంతో మహిళా నాయకురాలు జాగృతిలో చేరిక**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 8 :** కరీంనగర్ కు చెందిన జాగృతి మహిళ విభాగం జిల్లా నాయకురాలు బశెట్టి కృష్ణవేణి మరియు రూప ల ఆద్వర్యంలో పలువురు మహిళ నాయకురాళ్ళు ఈరోజు తెలంగాణ జాగృతిలో చేరడం జరిగింది. వారికి జిల్లా జాగృతి అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ కండువా కప్పి జాగృతిలోకి సాదరంగా ఆహ్వానించారు.జిల్లా కార్యాలయంలో ఎర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో చేరికల అనంతరం వారు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో జాగృతి రోజురోజుకు బలోపేతం అవుతుందని గ్రామస్థాయి నుండి స్వచ్ఛందంగా జాగృతిలో చేరుతాం కవిత నాయకత్వాన్ని బలపరుస్తాం అని చాలామంది నాయకులు మహిళ నాయకురాలు ముందుకు వచ్చి జాగృతిలో చేరుతున్నారని దీనితో చాలా స్పష్టంగా అర్థం అవుతుంది ప్రజలకు కవితక్క నాయకత్వం పైన సంపూర్ణమైన విశ్వాసం ఉందని నిత్యం ప్రజా సమస్యలు ప్రస్తావిస్తూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి రోజు కవితక్క ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంది రాష్ట్ర రాజకీయాల్లో ప్రతిపక్షం అనేది లేకుండా పాలకపక్షం ప్రతిపక్షం రెండు కలిపి పాలన చేస్తున్నాయి వాస్తవానికి ప్రజా సమస్యల మీద ఈ ప్రభుత్వాన్ని కేవలం జాగృతి సంస్థనే ప్రశ్నిస్తుంది పోరాడుతుంది ప్రధాన ప్రతిపక్షం ఈరోజు ప్రభుత్వానికి తొత్తుగా మారి ప్రజా సమస్యలను గాలికి వదిలేసింది అదేవిధంగా భారతీయ జనతా పార్టీ రేవంత్ రెడ్డి తో కుమ్మక్కై చోటే బాయ్ బడే భాయ్ అనే పద్ధతిలో ఒకరికి ఒకరు సహకరించుకుంటున్నారు వామపక్షాలు ఎలాగో ప్రభుత్వానికి మద్దతుగా ఉన్నాయి అంటే ఈ రాష్ట్రంలో కేవలం ప్రతిపక్ష పాత్ర కవితమ్మ ఒక్కతే ప్రోత్సహిస్తుంది అని చెప్పడానికి వెలుగుమట్ల బాధితుల పక్షాన నిలిచిన సంఘటననే ప్రజలు అర్థం చేసుకోవాలి. ఈనెల 25న కవితక్క నాయకత్వంలో రాష్ట్రంలో పేద ప్రజల భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యంగా తెలంగాణ అస్తిత్వంతో తెలంగాణ జాగృతి ఒక తిరుగులేని రాజకీయ శక్తిగా రూపాంతరం చెందబోతుంది అటువంటి సందర్భంలో తెలంగాణ నలుమూలల నుండి 25న జరిగే సమావేశానికి పెద్ద ఎత్తున ప్రజలు రావడానికి సిద్ధమవుతున్నారు కరీంనగర్ జిల్లా నుండి కూడా ప్రతి గ్రామము నుండి పార్టీ ఆవిర్భావ సభకు మేం పాల్గొంటాం మేము వస్తాం అని సమాచారం ఇస్తున్నారు దీన్నిబట్టి చూస్తేనే ప్రజలలో కవితక్క నాయకత్వానికి ఎంత విశ్వాసం ఉందో అర్థం అవుతుంది రానున్న రోజుల్లో నూతన రాజకీయ పార్టీగా తెలంగాణ హక్కుల కోసం తెలంగాణ అభివృద్ధి కోసం మహిళలు యువత బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా కవితక్క పనిచేస్తుందని జాగృతి జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల తిరుపతి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు హంకం శివరాణి జిల్లా సీనియర్ నాయకులు రంగారవేణి లక్ష్మణ్, గాలిపల్లి రత్నాకర్ చారి, గర్శకుర్తి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను వంచిస్తోంది

**-దళిత బంధు సాధన నేతల ఆగ్రహం**
**-132 కుటుంబాలకు దళిత బంధు నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్**



**చురకలు ప్రతినిధి,మంథని, ఏప్రిల్ 8 :** ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, దళితులను బీసీలను మైనారిటీ వర్గాలను వంచి స్తోందని దళితబంధు సాధన సమితి నాయకులు తీవ్రంగా విమర్శించారు. మంథని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత బంధు రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులు గద్దల శంకర్, మంథని డివిజన్ దళిత బంధు సాధన సమితి అధ్యక్షులు ఊట్ల శ్రీను మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రకటించిన 'అంబేద్కర్ అభయహస్తం' పథకం ద్వారా ప్రతిదళిత కుటుంబానికి రూ. 12లక్షలు అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు.అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సంవత్సరాల కాలం గడిచినా ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని ఆరోపించారు. మంథని నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే అర్హులైన 132 కుటుంబాలకు దళిత బంధు నిధులు మంజూరైనా, వాటిని విడుదల చేయకుండా నిలిపివేశారని నేతలు ఆరోపించారు. కలెక్టర్ ఖాతాలో పడిన నిధులను కూడా విడుదల చేయకుండా ఆలస్యం చేస్తున్నారని తక్షణమే ఆ నిధులను విడుదల చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో దళితులకు అండగా ఉంటామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించడం సరికాదని నేతలు హెచ్చరించారు. తక్షణమే దళిత బంధు, అభయహస్తం పథకాల నిధులను విడుదల చేసి, అర్హులైన కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.దళితులను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగిస్తున్నారని ఆరోపిస్తూ, సమస్యను వెంటనే పరిష్కరించకపోతే గ్రామ గ్రామాన ప్రజలను చైతన్య పరచి ప్రభుత్వంపై ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నేతలు హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మంతెన లక్ష్మణ్, మంథని డివిజన్ దళిత సంఘం సీనియర్ నాయకులు,అవునూరి రాజలింగం కమాన్‌పూర్ మండల దళిత బంధు సాధన సమితి అధ్యక్షులు, మంత్రి రాజబాబు రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి తోటపల్లి రాజబాబు, దళిత బంధు మంథని డివిజన్ నాయకులు జూల రమేష్, మేకల వెంకటస్వామి, గువ్వల రాజు, జనగామ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ పోలీస్... మీ పోలీస్....

**-ఎస్పీ క్యాంప్ కార్యాలయం లో గ్రీవెన్స్ డే కార్యక్రమం**
**-బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం**
**-జిల్లా ఎస్పీ. జానకి షర్మిల**



**చురకలు ప్రతినిధి,నిర్మల్, ఏప్రిల్ 08 :** ఈ సందర్భంగా భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 13 మంది అర్జిదారుల ఫిర్యాదులను స్వీకరించి,ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు.ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**కుటుంబ వివాదాల పరిష్కారంలో 'షీ టీం' పాత్ర:**

ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. ప్రజలు నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా, భైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

# నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

**-జగన్నాధపురం గ్రామ శాఖ అధ్యక్షులు ముస్కే శ్రీనివాస్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 8 :** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలా నిలిచిందని జగన్నాధపురం గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కే శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన 26 వేల రూపాయల విలువ గల చెక్కును లబ్ధిదారు పంజాల రాణి కి బుధవారం గ్రామ కాంగ్రెస్ సీనియర్‌నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందజేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పెండ్యాల కుమార స్వామి, ఆరేపల్లి సమ్మయ్య, ఆరెపల్లి చిరంజీవి, మాజీ ఉప సర్పంచులు ఆరెపల్లి సమ్మయ్య, ఆరేపల్లి రమేష్, మాజీ వార్డు సభ్యులు పెండ్యాల భాస్కర్, పెండ్యాల సామేల్, బండి కుమారస్వామి,కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండాల మధు, గూటం శ్రీనివాస్ రెడ్డి,జివిస్‌రెడ్డి మాటూరి శ్రీనివాస్, శివరాత్రి మల్లయ్య, అరెపల్లి ఎల్లయ్య, కంసారపు సంపత్,పెండ్యాల పౌలు, ఆరెపల్లి కళ్యాణ్,ఎస్.డి హుస్సేన్,ఎస్.డి.కరీం,మేకల రాజు,హుస్నాబాద్ నియోజక వర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నాయకులు పంజాల అభిలాష్, పెండ్యాల రాజేష్ పంజాల అజయ్,కస్తూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# విఠల్ రెడ్డినీ కలిసిన తురాటి గ్రామస్తులు



**చురకలు ప్రతినిధి,నిర్మల్, ఏప్రిల్,08 :** నర్సాపూర్ మండలంలోని తురాటీ గ్రామంలో శ్రీ శివాలయం నిర్మాణం తొందరగా చేపట్టాలని కోరడం జరిగింది సానుకూలంగా స్పందించిన మాజీ శాసనసభ్యులు విఠల్ రెడ్డి ఈ విషయాన్ని మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి మరియు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి మరియు మన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లి తప్పకుండా చేయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. తురాటి గ్రామానికి చెందిన దత్తురామ్ అనే లబ్ధిదారునికి సుమారు 25వేల రూపాయల సీఎం సహాయనిది చెక్కును కూడా అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గౌరా శ్యాంసుందర్,మాజీ ఉపసర్పంచ్ లక్ష్మణ్, రాజేందర్, రమణ గౌడ్,వీడిసి అధ్యక్షులు ఎడిపల్లి రాజేశ్వర్,మధు, కోమటి ముత్యం సదానంద్ మరియు తదితరులు ఉన్నారు.

# "ఆత్మహత్య యత్నం నుంచి మహిళను రక్షించిన పోలీస్ అక్కలు (నారిశక్తి)"

**-అభినందించిన జిల్లా ఎస్పీ.జానకి షర్మిల**



**చురకలు ప్రతినిధి, నిర్మల్, ఏప్రిల్, 08 :** నిజామాబాద్‌కు చెందిన ఒక మహిళ తన భర్తతో జరిగిన కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై ఇంటి నుండి వెళ్లిపోయింది. అనంతరం బాసర గోదావరి నదిలో ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించింది. ఈ విషయం తెలిసిన కుటుంబ సభ్యులు వెంటనే డయల్ 100కు సమాచారం అందించారు.డయల్ 100 సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన పోలీస్ అక్క (నారిశక్తి) బృందం సంఘటనా స్థలానికి చేరుకుని, అప్రమత్తంగా వ్యవహరించి ఆ మహిళను ఆత్మహత్య కు పాల్పడకుండా ప్రాణాలను కాపాడారు. అనంతరం మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ.జానకి షర్మిల మాట్లాడుతూ సమయోచితంగా స్పందించి ఒక ప్రాణాన్ని కాపాడిన పోలీస్ అక్కలను (నారిశక్తి) బృందాన్ని అభినందించారు. పోలీస్ అక్క (నారిశక్తి),మహిళల భద్రత కోసం మాత్రమే కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో కూడా ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించిన పోలీస్ అక్కలు దీపిక,సుమేర లను జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు.

## అంగన్వాడీ కేంద్రంలో అన్న ప్రాసన..



**చురకలు విలేఖరి వీణవంక ఏప్రిల్ 08:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా బుధవారం మండలంలోని లస్మక్క పల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రం లో అన్న ప్రాసన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి ద్వారా పిల్లలకు గుడ్లు, పాలు, తదితర పౌష్టికాహారం అందిస్తుంది. దీంతో పిల్లల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్, పిల్లలు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టు న్యాయవాదుల నల్ల బ్యాడ్జీలతో నిరసన




**చురకలు విలేఖరి కరీంనగర్, ఏప్రిల్, 08:** వేములవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది మాజీ అధ్యక్షులు పిట్టల భూమేష్ పట్ల రౌడీ షీటర్ అనుచిత వ్యాఖ్యలతో బెదిరింపులకు పాల్పడిన ఘటనను ఖండిస్తూ బుధవారం కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు తమ నిరసన తెలిపారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్ ,ప్రధాన కార్యదర్శి చంద్రపాటి కిరణ్ కుమార్ ల ఆధ్వర్యంలో న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి జిల్లాకోర్టు ఆవరణలో తమ నిరసన తెలిపారు. న్యాయవాదుల పట్ల ఇలాంటి ఘటనలను ఖండిస్తూ భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని, సంబంధిత వ్యక్తులపై పోలీసులు చర్యలు చేపట్టాలని అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్ ఈ సందర్బంగా డిమాండ్ చేసారు .ఈ కార్యక్రమం లో అసోసియేషన్ ఉపాధ్యక్షులు బండ శివకుమార్, కార్యవర్గ సభ్యులు బెజ్జంకి శ్రీకాంత్, అనురాధ, బి శాంతికుమార్, బెజ్జంకి శ్రీనివాస్ , న్యాయవాదులు ఎల్ రాజేశం, పూరెల్లి రాములు, కల్లేపల్లి లక్ష్మయ్య, తుమికి పవన్, పి వేణుగోపాల్, బి రాంబాబు, బాకం సంపత్, యం వేణు గోపాల్, బి వేణు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో వాటర్ ట్యాంక్

### -ప్రమాదపు అంచున హిమ్మత్ నగర్ గ్రామస్తులు

### -నూతన వాటర్ ట్యాంక్ నిధులు కేటాయించాలి

**చురకలు విలేఖరి వీణవంక, ఏప్రిల్ 08:** వీణవంక మండల పరిధిలోని హిమ్మత్ నగర్ గ్రామంలో గ్రామ పంచాయతీ సమీపంలో 22 సంవత్సరాల క్రితం నిర్మించిన 60,000 లీటర్ల సామర్థ్యం గల మంచినీటి వాటర్ ట్యాంక్ ప్రస్తుతం అత్యంత ప్రమాదకర స్థితికి చేరుకుంది. ట్యాంక్ పిల్లర్లు పూర్తిగా శిథిలమై,పెచ్చులు ఊడిపోతుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా



వార్డు సభ్యురాలు నవ్య – భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. వేల లీటర్ల నీటితో నిండి ఉండే ఈ ట్యాంక్ గనుక కూలిపోతే భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు.సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు వెంటనే గ్రామానికి వచ్చి ట్యాంక్ పటిష్టతను పరిశీలించాలనీ కోరారు. పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉందని విద్యార్థులకు ఏమైనా జరుగుతే ఎలా అని ప్రశ్నించారు.?శిథిలమైన ట్యాంక్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి లేదా పాత ట్యాంక్ తొలగించి కొత్తది నిర్మించాలనీ అందుకు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలని,అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని హిమ్మత్ నగర్ ప్రజలు కోరుతున్నారు.

# సెస్ సంస్థను ఎన్ పీడీసీఎల్‌లో విలీనం చేసినందుకు

### -సిఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన భారతీయ కిసాన్ సంగ్ ప్రతినిధులు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 08 :** సిరిసిల్ల కో-ఆపరేటివ్ ఎలక్ట్రికల్ సప్లై సొసైటీ ని ఎన్ పీడీసీఎల్ లో విలీనం చేసినందుకు సి ఎం రేవంత్ రెడ్డి కి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల గృహ వినియోగదారుల వస్త్ర పరిశ్రమల ఇండస్ట్రీ వినియోగదారుల అందరి పక్షాన భారతీయ కిసాన్ సంగ్ ప్రతినిధులు జోగినిపల్లి సంపత్రావు ధ్యాప దేవయ్య యాదవులు కృతజ్ఞతలు తెలిపారు, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్ పి డి సి ఎల్ అధికారులు ప్రజలందరితో క్లస్టర్ల వైజ్ గా సమావేశాలు ఏర్పాటు చేయాలని కరపత్రాల ద్వారా ప్రచారం చేసి వాట్సప్ ద్వారా సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు, ప్రమాద వశత్తు కరెంటు షాక్ తో చనిపోతే వారికి ఐదు లక్షల నుండి 8 లక్షల వరకు ప్రకటించడం మంచిదే నన్నారు, ఈ ఆర్ సి రైతులకు హార్స్ పవర్ కు వెయ్యి రూపాయలు ఎన్ని హార్స్ పవర్ లకైన అన్ని వేలు చెల్లించడం అనేది కిలోమీటర్ల వరకు లైన్ ఉచితంగా ఇవ్వడం అనేది ఎంతో సంతోషకరమైన విషయం అన్నారు గృహా వినియోదారులకైనా కిలో హార్స్ పవర్ కు 500 చొప్పున ప్రకటించడం సంతోషం అన్నారు, పెండింగ్ లో ఉన్న కనెక్షన్లు గృహ వినియోగదారులకు కొత్త కనెక్షన్లను కూడా వెంటనే మంజూరు చేయాలని దేశానికి ఆహారం ఉత్పత్తి చేయడానికి రైతులకు చేయూత నివ్వడానికి భారతీయ కిసాన్ సంగ్ తరపున విజ్ఞప్తి చేశారు, బోరు బావి కే కాకుండా కాలువలకు వాగులకు వ్యవసాయ కరెంటు కనెక్షన్ పెట్టుకొనుటకు నిబంధనలను సడలించి అనుమతులు ఇవ్వాలని వారుకోరారు, ట్రాన్స్ఫార్మర్లు అక్కడక్కడ ఓవర్ లోడ్ అయ్యి మోటర్లు కాలిపోతున్నాయని వెంటనే అవసరమున్న చోట అదనకు ట్రాన్స్ఫార్మర్లు పెట్టవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు, బోయినపల్లి మండలం లో సెస్ ఆఫీసు భవన నిర్మాణం చేస్తామని ఇంతవరకు చేయలేదు వెంటనే బిల్డింగ్ నిర్మాణం పనులు చేపట్టాలని వారు కోరారు, లూజు లైన్ల వలన హార్వెస్టర్లు కాలిపోతున్నాయని సర్వే చేయించి జూన్ నెలలోపు లూజు లైన్లు సరి చేయాలని అదేవిధంగా విద్యుత్తు లైన్ లు రోడ్డు వెంటనే వేయాలి పోలాల మధ్య నుండి వద్దని వారు విజ్ఞప్తి చేశారు, సి జి ఆర్ ఎస్ సమావేశాలు నెలరోజుల ముందు నోటిఫికేషన్ ప్రకటించి పత్రికా ప్రకటనలు ద్వారా కరపత్రాల ద్వారా మైకు ద్వారా డబ్బు చాటింపు ద్వారా కాకుండా సర్పంచ్లకు కార్యదర్శులకు ఎంపిపి లకు జడ్పీటీసీ లకు ఎంపీటీసీలకు సింగిల్ విండో చైర్మన్ లకు తెలియజేయవలసిందిగా వారు కోరారు, సిరిసిల్ల జిల్లాలో కరెంటు దొంగతనం జరగకుండా విజిలెన్స్ సిబ్బందిని ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టాలని వారు ఎన్ పీడీసీఎల్ చైర్మన్ కర్నాటి వరుణ్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు, విలేకరుల సమావేశంలో భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు నిమ్మ నారాయణరెడ్డి మార్పు రాజిరెడ్డి బండారి బాల్రెడ్డి సర్పంచుల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య, పారుపల్లి సంజీవరెడ్డి మండే శ్రీనివాస్ యాదవ్ ,తదితరులు పాల్గొన్నారు,

### మున్సిపల్‌లో డిప్యూటీ మేయర్‌కు

# చాంబర్ కేటాయించడం సిగ్గుచేటు




**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 8:**కరీంనగర్ నగర పాలక సంస్థలో మార్పు తెస్తామని చెప్పినటువంటి బిజెపి రెండు నెలలు కాకముందే బిఆర్ఎస్ అవలంబించినట్టుగా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ డిప్యూటీ మేయర్ ఛాంబర్ ప్రారంభించుకోవడం చూస్తుంటే అవినీతికి బిజెపి కూడా ఏం తక్కువ కాదని నిరూపించుకుంటుందని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి సహాయ కార్యదర్సులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజులు విమర్శించారు. నగరపాలక సంస్థలో మున్సిపల్ కమిషనర్ బిజెపికి అనుకూలంగా వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. గతంలో మున్సిపల్ లో డిప్యూటీ మేయర్ ఛాంబర్ ను ఏర్పాటు చేస్తే బిజెపి పార్టీతీవ్రంగా వ్యతిరేకించి పోరాటాలు చేసిందని కానీ నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం గత పాలనలో అవలంబించిన విధానాలే బిజెపి కూడా అవలంబించడం దుర్మార్గమైన చర్యని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో రాష్ట్ర మంత్రిని అడ్డుపెట్టుకొని డిప్యూటీమేయర్ చాంబర్ ఏర్పాటు చేశారని ఇప్పుడు కేంద్రమంత్రి నీ అడ్డుపెట్టుకొని ఏర్పాటు చేశారని వారికి వీరికి ఏమీ తేడా లేదని అధికార దాహం తప్ప ప్రజల సమస్యలు పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆరోపించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రథమ పౌరుడైన మేయర్ మాత్రమే చాంబర్ ఉండాలని డిప్యూటీ మేయర్ కు ఛాంబర్ ఉండాలనిఏనిబంధనలో లేదని కానీ ప్రజాధనం కోల్లగొట్టడానికి బిజెపి నిబంధనలను తుంగలో తొక్కి అవినీతికి పాల్పడాలని చూస్తుందని బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై, డిప్యూటీ మేయర్ చాంబర్ ఏర్పాటుపై సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని కసిరెడ్డి సురేందర్ రెడ్డి, పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజులు ఒక ప్రకటనలో హెచ్చరించారు.

# డంప్ యార్డ్ సమస్యపై కలెక్టర్‌తో చర్చించిన వొడితల ప్రణవ్



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 08:** హుజూరాబాద్ పట్టణ శివారులోనీ సిర్సపల్లి ప్రాంతంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ పై,జీవన ప్రమాణా లకు దూరంగా ఉండాలని,దాన్ని తరలిం చే విషయంపై జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తో సుదీర్ఘంగా చర్చించారు హుజూ రాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.ఈ సంద ర్భంగా కలెక్టరేట్ కార్యాలయంలో మర్యా దపూర్వకంగా కలిశారు.అనంతరం డం పింగ్ యార్డు వల్ల కలిగే నష్టాలను, పంటలకు తలెత్తే ఇబ్బందులను,రైతులకు కలిగే నష్టాలను,జనావాసాలకు దూరం గా ఉండాలని తెలిపారు.దీనిపై ఇప్పటికే మంత్రులను,మున్సిపల్ శాఖ అధికారుల ను కలిసి పూర్తి వివరాలు అందజేశా మని, దీనిపై మరోసారి అధికారులతో చర్చించాలని కోరారు.సానుకూలంగా స్పందించిన వారు పూర్తి నివేదిక తీసుకుంటానని తెలిపారు.

# జనగణన నమోదు చాలా సులువు

చురకలు ప్రతినిధి కరీంనగర్ **ఏప్రిల్ 8 :** జనగణన అధికారుల ప్రమేయం లేకుండానే ఇంట్లో నుండే డిజిటల్ విధానంలో సొంతంగా ప్రతి ఒక్కరూ జనగణన వివరాలను నమోదు చేసుకునే అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఈనెలలో ప్రారంభమైన జనగణనలో భాగంగా తొలిదశలో హౌజ్ లిస్టింగ్ (ఇంటి వివరాలు), హౌజింగ్ సెన్సెస్ (ఇంట్లోని సౌకర్యాల) వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. అందు కోసం https://se.census.gov.in వెబ్ సైట్ సందర్శించాలని సూచించారు. ఈరోజు జాతీయ రిజిస్ట్రార్ జనరల్, జనాభా గణాంకాల కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్, జాయింట్ డైరెక్టర్ దీరజ్ జైన్ తోపాటు ఆ విభాగానికి




చెందిన పలువురు ఉన్నతాధికారులు న్యూఢిల్లీలోని కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసానికి విచ్చేశారు. జనగణనలో భాగంగా తొలిదశలో చేపడుతున్న హౌజ్ లిస్ట్, హౌజింగ్ సెన్సెస్ వివరాలను వివరించారు. తొలిదశలో లోకేషన్ డిటైల్స్, ఒక కుటుంబం ఉండే ఇల్లు, ఆఫీస్, సౌకర్యాల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంట్లోనుండే స్వీయ ఎన్యుమరేషన్ ను నమోదు చేసుకునేందుకు వెబ్ సైట్ ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ డిజిటల్ విధానంలో సొంతంగా తన ఇల్లు, ఇంట్లోని సౌకర్యాల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.... ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో డిజిటల్ విధానంలో జనగణన నిర్వహించడం శుభపరిణామమని అన్నారు. తద్వారా భారత అభివృద్ధిని మరింత వేగవంతం చేసి, వికసిత భారత్ లక్ష్య సాధనకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో ఈ మహత్తర జాతీయ కార్యక్రమాన్ని కాగితాలతో పనిలేకుండా డిజిటల్ సాధనాలతో నిర్వహించడం, పౌరులకు స్వీయ-ఎన్యూమరేషన్ అవకాశాన్ని కల్పించడం ద్వారా జనగణన దిగ్విజయవంతం అవుతుందని అన్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ప్రజలు స్వీయ-ఎన్యూమరేషన్ పోర్టల్ ద్వారా తమ వివరాలను సమర్పించేందుకు ముందుకు వస్తుండటం సంతోషదాయకమని చెప్పారు. ప్రతి ఒక్కరూ అధికారిక https://se.census.gov.inను సందర్శించి స్వీయ-ఎన్యూ మరేషన్ పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

## యువతలో స్కిల్స్ పెంచేందుకు
# ప్రణాళికలు రూపొందించండి
## కలెక్టర్ చిత్రా మిశ్రా




చురకలు ప్రతినిధి కరీంనగర్ **ఏప్రిల్ 08:** జిల్లాలోని పరిశ్రమలు, ఆసుపత్రులు తదితర సేవా రంగ సంస్థల్లో యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రైవేట్ పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులు, ఫ్యూచర్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ డైరెక్టర్ రుచి గుప్తా తో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న ఉద్యోగాల కోసం అవసరమైన స్కిల్స్ యువత పెంచుకునేలా చూడాలన్నారు. తమ పరిశ్రమలు, కంపెనీల్లో పనిచేసేందుకు అవసరమైన స్కిల్స్ కల్గిన అభ్యర్థుల కోసం జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారిని సంప్రదించాలని.. ప్రైవేటు పరిశ్రమల ప్రతినిధులకు సూచించారు. నైపుణ్యాలు పెంపొందించే ఐటిఐ, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొనేలా చూడాలన్నారు. స్కిల్ అప్ గ్రేడ్ , స్కిల్ డెవలప్మెంట్ గురించి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. స్థానిక యువతలో స్కిల్స్ పెంచి ఉద్యోగాలు సాధించేలా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా ఉపాధి కల్పన శాఖ జాయింట్ డైరెక్టర్ రేఖా రాణి, డిప్యూటీ డైరెక్టర్ రమేష్ బాబు, ఉపాధి కల్పన శాఖ వరంగల్ రీజినల్ ఆఫీసర్ రవీందర్, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి తిరుపతిరావు, మెప్మా పీడీ స్వరూప రాణి, పరిశ్రమల శాఖ జీఎం సాల్మన్ రాజ్ , వివిధ శాఖల అధికారులు, టాటా, ఆదర్శ, వరుణ్ మోటార్స్, అపోలో, కరీంనగర్ డెయిరీ , రైస్ మిల్, గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు, మలబార్ గోల్డ్ కరీంనగర్ శాఖప్రతినిధులు పాల్గొన్నారు.

# మానేరు రివర్ ఫ్రంట్ పనులు వేగవంతం చేయండి

చురకలు ప్రతినిధి కరీంనగర్ **ఏప్రిల్ 8:** కరీంనగర్ నగరానికి మరింత అందం చేకూర్చే మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు ఆదేశించారు. మిగిలిన పెండింగ్ పనులను (బ్యాలెన్స్ వర్క్స్) త్వరితగతిన పూర్తి చేసి, ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇరిగేషన్, టూరిజం, రెవెన్యూ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మానేరు రివర్ ఫ్రంట్ పనుల




పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఇప్పటివరకు పూర్తైన పనులు, ఇంకా మిగిలిన పనుల స్థితి, అవసరమైన బడ్జెట్, భూ సేకరణ పురోగతి వంటి అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, భూ సేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, మిగిలిన పనులను బడ్జెట్ ప్రకారం చేపట్టాలని స్పష్టం చేశారు. బ్యూటిఫికేషన్ వర్క్స్, రైలింగ్, గార్డెనింగ్ వంటి అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ ద్వారా కరీంనగర్ నగరానికి కొత్త శోభ చేకూరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇరిగేషన్, టూరిజం కార్పొరేషన్, రెవెన్యూ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి, ఎలాంటి ఆటంకాలు లేకుండా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా బైపాస్ రోడ్డు నుంచి మానేరు రివర్ ఫ్రంట్ వరకు రోడ్డు కనెక్టివిటీ పనులను ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, ఇరిగేషన్ ఈఈ సదయ్య, డీఈలు, తహసీల్దార్లు శ్రీనివాస్ రెడ్డి, నరేందర్, టూరిజం కార్పొరేషన్ ఏఈ జీవన్ రెడ్డి పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి, బీఆర్ఎస్ చెత్తతో చెత్త రాజకీయాలు

**-పాడి కౌశిక్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ డబుల్ డ్రామాలు**

**-మానర్ రివర్ ఫ్రంట్ కోసం మానేర్ చుట్టూ తిరిగిన గంగులకు డంపు యార్డు కనబడలేదా**

**-కరీంనగర్లో చెత్త పేరుకు పోవడానికి కారణం బిఆర్ఎస్,బిజేపి ప్రభుత్వాలు కాదా**

**-సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తీవ్ర విమర్శలు**

చురకలు ప్రతినిధి కరీంనగర్, ఏప్రిల్ **08 :** కరీంనగర్ లో డంపు యార్డు విషయంలో బిజెపి, బీఆర్ఎస్ రెండు పార్టీలు చెత్తతో చెత్త రాజకీయాలు చేస్తున్నాయని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో స్మార్ట్ సిటీ నిధులలో కోట్ల రూపాయలు కొల్లగొట్టి అవినీతి పాలన చేశారని మండిపడ్డారు. కరీంనగర్ లో గుట్టలు గుట్టలుగా చెత్త పేరుకు పోవడానికి ప్రధాన కారణం గత బిఆర్ఎస్ పార్టీ అసమర్థ పాలన కాదా అని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. గత ఏడాదిజనవరి 24 న కేంద్ర పురపాలక శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో తెగ హడావిడి చేసి డంపు యార్డ్ సమస్యకు పరిష్కారం చూపుతామన్న బండి సంజయ్ కుమార్ ఇప్పుడు డంపు యార్డు విషయంలో రెండు నాలుకల ధోరణి అవలంబిస్తున్నారని నరేందర్ రెడ్డి



మండిపడ్డారు. చెత్తను తరలిస్తామని అడ్డగోలు హామీలు ఇచ్చి మున్సిపల్ ఎన్నికల్లోనూ ఓట్లు దండుకున్నారని ఆరోపించారు. కరీంనగర్లో ఒకటి హుజురాబాద్ లో మరొకటి మాట్లాడుతూ డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ లోని డంప్ యార్డ్ లో చెత్తను తొలగించే విషయంలో బండి సంజయ్ కేంద్రం నుంచి ఒక్క రూపాయి అయినా తెచ్చారా అని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వాటాను దాచి కరీంనగర్ ను కేంద్రమే అభివృద్ధి చేస్తుందని అబద్ధాలు చెప్పారని, ఇప్పటికైనా ప్రజలకు భ్రమలు కల్పించడం మానుకోవాలని అన్నారు. హుజురాబాద్ లో బీఆర్ఎస్ బిజెపి నేతలు దీక్షల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని, ఉరేసుకొని చస్తామంటూ పల్టీలు కొడుతున్నారని విమర్శించారు. బిఆర్ఎస్,బిజేపీ పార్టీల వారిని ప్రజలు ఉరికించి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని నరేందర్ రెడ్డి హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ఉరేసుకోవాల్సిన అవసరం లేదని, ప్రజలే ఉరివేస్తారని అన్నారు. కరీంనగర్ లోని డంప్ యార్డు లో చెత్తను పూర్తిగా తొలగించి వెస్ట్ ఎనర్జీ ప్లాంట్ ద్వారా ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి ఎటువంటి నిల్వ లేకుండా చేయాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి నెరవేరుస్తారని అన్నారు. చెత్త నిల్వ లేనప్పుడు అది సిర్సపల్లి లో ఏర్పాటు చేసిన ఎక్కడ ఏర్పాటు చేసినా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగవని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికైనా డంప్ యార్డ్ విషయంలో బిజెపి బీఆర్ఎస్ చేస్తున్న కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో తాజొద్దీన్,పిట్టల రవీందర్,కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి,వరాల నర్సింగం,పర్వతం మల్లేశం,కాంతాల జగన్ రెడ్డి,నాయకులు గుండాటి శ్రీనివాస్ రెడ్డి,సరిల్ల ప్రసాద్,ఇక్రమ్ సిఖిందర్,కొట్టె ప్రభాకర్,ఖలీల్,దేవేందర్ పటేల్,హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.